క్లుప్తంగా

9 నుంచి మార్కుల మెమో పంపిణీ

కడప ఎడ్యుకేషన్: కడప ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలకు సంబంధించి మార్చి 2023 రెగ్యులర్ విద్యార్థులకు, మే 2023 సప్లమెంటరీ విద్యార్థులకు ఒరిజినల్ మార్కుల మెమోను 9వ తేదీ నుంచి పంపిణీ చేస్తామని ఆ కళాశాల ప్రిన్సిపాల్ నూర్జహాన్ తెలిపారు. కళాశాలలో విద్యనభ్యసించిన రెగ్యులర్, సప్లమెంటరీ పరీక్షలు రాసిన విద్యార్థులంతా సోమవారం కళాశాలకు వచ్చి మార్కుల మెమోను తీసుకుపోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

జాబ్‌మేళా

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం జాబ్‌మేళా నిర్వహించారు. కళాశాల జేకేసీ ఆధ్వర్యంలో సింక్రెస్ కన్సల్టింగ్ లిమిటెడ్ సంస్థ సహకారంతో ప్రాసెస్ అసోసియేట్ ఉద్యోగాలకు ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలకు 70 మంది విద్యార్థులు హాజరుకాగా వారి నైపుణ్యం, అర్హతను పరిగణలోకి తీసుకుని 8 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా తెలిపారు. కార్యక్రమంలో జేకేసీ కో ఆర్డినేటర్ సుజాత, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యుత్ అదనపు చార్జీలు రద్దు చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ అదనపు చార్జీలను రద్దు చేయాలని సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు చంద్ర, చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యుత్ ప్రవేటీకరణ బిల్లును తీసుకువచ్చి విద్యుత్ సంస్థలను అప్పుల ఊబిలోకి నెట్టి కార్పోరేట్ కంపెనీలకు కట్టబెట్టాలనే దుస్సాహసానికి ఒడిగట్టిందన్నారు. ఈ సమస్యలపై దశల వారి పోరాటాల్లో భాగంగా ఈనెల 9 నుండి 15 వరకు జిల్లాలో సభలు, సమావేశాలు, ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వామపక్ష నాయకులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేడెట్స్‌కు అభినందన

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల నుంచి ప్రతిష్టాత్మక తల్‌సైనిక్ క్యాంపులో ఇద్దరు ఎన్‌సీసీ కేడెట్స్ పాల్గొని సత్తాచాటారు. ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన తల్‌సైనిక్ క్యాంపులో కళాశాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్స్ సంతోష్‌కుమార్, ఉస్మాన్‌బాషాలు పాల్గొని బంగారు, రజత పతకాలు సాధించారు. దీంతో శనివారం కళాశాల ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ డా. ఆర్. నీలయ్య ఆధ్వర్యంలో ఎన్‌సీసీ కేడెట్స్‌కు అభినందన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ , ఎన్‌సీసీ అధికారి డా. మహేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలోని గురుకులం భవనాల్లో ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పరిసరాలను శుభ్రం చేశారు. ఆవరణంలోని పిచ్చిమొక్కలను, ప్లాస్టిక్ కవర్లను తొలగించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. పి. సరిత మాట్లాడుతూ ఎప్పుడూ మనచుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

పెన్షనర్స్‌కు ప్రత్యేక రూల్స్ రూపొందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామ్మూర్తినాయుడు

కడప ఎడ్యుకేషన్: పదవీ విరమణ చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం ప్రత్యేక రూల్స్‌ను రూపొందించి ఆదుకోవాలని పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మూర్తినాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగమునిరెడ్డి కోరారు. శనివారం కడప పెన్షనర్ల సంఘం కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్షనర్లకు డీఆర్, పీఆర్‌సీ బకాయిలను సంవత్సరాల తరబడి వాయిదాల రూపంలో చెల్లించాలనటంతో అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. గతంలో మాదిరిగా ఒకే సారి చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ కార్యదర్శి రాధాకృష్ణ, గౌరవాధ్యక్షులు వెంకటరెడ్డి, బాలయల్లారెడ్డి, ఉపాధ్యక్షులు దేవరాజు, సుభాన్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

శనగ విత్తనాల పంపిణీ సజావుగా చేపట్టండి

కమలాపురం : మండలంలో జరుగుతున్న శనగ విత్తనాల పంపిణీ సజావుగా జరిగేలా చూడాలని స్టేట్ హార్టికల్చర్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక 4వ వార్డు ఆర్‌బీకేలో నిర్వహించిన వ్యవసాయ సిబ్బంది సమావేశంలో జేడీఏ అయితా నాగేశ్వరరావుతో కలసి ఆయన మాట్లాడారు. మండలానికి 4910 క్వింటాళ్ల శనగ విత్తనాలు మంజూరు అయ్యాయని, 40 శాతం సబ్సిడీతో 40కిలోలు పంపిణీ చేస్తున్నారన్నారు. జేడీఏ మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ పంట నమోదు ప్రక్రియ పూర్తి అయిందని, ఈకేవైసీ 95శాతం పూర్తి అయిందన్నారు. మిగిలిన రైతులకు రేపటి లోగా పూర్తి చేయాలన్నారు.

మళ్లీ జగనే ముఖ్యమంత్రిగా కావాలి



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



సమావేశానికి హాజరైన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు

– ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధి పథంలో మరింత ముందుకు నడవాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు. శనివారం స్థానిక యూఎస్ మహల్ కళ్యాణ మండపంలో ×ఎందుకు ఆంధ్రాకు జగన్ కావాలి₹ కార్యక్రమంపై క్లస్టర్-4 వెస్ట్ జోన్ పరిధిలోని డివిజన్ల కార్పొరేటర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలు 98 శాతం అమలు చేశారని తెలిపారు. చంద్రబాబు ప్రజాధనాన్ని దోపిడీ చేసి జైలుకు వెళ్లారనే విషయాన్ని ప్రజలకు తెలియజేయడంతోపాటు, ఎల్లో మీడియా దుష్ప్రచారాన్ని కూడా తెలపాలన్నారు. ఇప్పుడు కష్టపడి పనిచేస్తే భవిష్యత్ కార్యకర్తలదేనని భరోసా ఇచ్చారు. నాడు-నేడు ద్వారా ఆసుపత్రులు, పాఠశాలల భవనాల రూపురేఖలే మారిపోయాయన్నారు. వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పార్టీకి మూలస్తంభాల్లాంటి వారన్నారు. పార్టీ నిర్దేశించిన కార్యక్రమాలకు హాజరు కాకుండా ఉన్నవారిని గుర్తించి, ఉత్సాహంగా ఉన్నవారిని నియమించాలన్నారు. ఈ సమావేశంలో టీటీడీ బోర్డు సభ్యులు మాసీమ బాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, కార్పొరేటర్లు పాకా సురేష్, పార్టీ నాయకులు చల్లా రాజశేఖర్, రామక్రిష్ణారెడ్డి, నాగమల్లారెడ్డి, మధువర్ధన్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు మద్దతు తెలపండి



ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనకు ప్రజలు మద్దతు పలకాలని, మళ్లీ ఆయన్ను ముఖ్యమంత్రిని చేసేలా ఆశీర్వదించాలని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషా అన్నారు. శనివారం గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా 7 డివిజన్‌లోని విద్యుత్ నగర్‌లో ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా చేరుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కుల,మత, పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని, ఆయన్ను మళ్లీ ఆశీర్వదించాలని కోరారు.

– ఈ సందర్భంగా ఎం. లక్ష్మిదేవి అనే మహిళ మాట్లాడుతూ గతంలో వృద్ధాప్య పింఛన్ కోసం చాలా దూరం వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు వాలంటీర్ ఇంటికే వచ్చి ఇస్తున్నాడని సంతోషం వ్యక్తం చేసింది. వైఎస్సార్ రైతు భరోసా ద్వారా లక్షా ఇరవై వేల వరకూ లబ్ధి పొందామని తెలిపింది.

– దేరంగుల పద్మావతి మాట్లాడుతూ సున్నావడ్డీ, ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు భరోసా ద్వారా తమకు రెండు లక్షలా ముప్పైవేల రూపాయల లబ్ధి చేకూరిందని తెలిపింది.

– ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, 7వ డివిజన్ ఇంచార్జి గంగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు జయచంద్రారెడ్డి, సుబ్బారెడ్డి, సీహెచ్ వినోద్, రామ్మోహన్‌రెడ్డి, పస్తం అంజి, గోపాలక్రిష్ణ, అర్జున్, మహిళా నేతలు పత్తిరాజేశ్వరి, టీపీ వెంకట సుబ్బమ్మ, ఎం. సరస్వతి, మల్లీశ్వరి, సుశీలమ్మ పాల్గొన్నారు.

పేదల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత



రోగులను పలకరిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: పేదల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాష పేర్కొన్నారు. శనివారం స్థానిక వైఎస్సార్ కాలనీ(వికలాంగుల కాలనీ)లోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వద్ద జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో అశోక్‌నగర్, బుడ్డాయపల్లె, పద్మావతి నగర్, పుట్లం పల్లి, రామక్రిష్ణ నగర్, ఉక్కాయపల్లె ప్రాంతాలకు సంబంధించి జగనన్న ఆరోగ్య సురక్ష 6 వ క్యాంపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ విద్య, వైద్యం రంగాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, అందులో భాగంగానే ఆయా రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చారని గుర్తు చేశారు. అత్యుత్తమ వైద్యాన్ని ప్రజల చెంతకు తెచ్చేందుకే ×జగనన్న ఆరోగ్య సురక్ష₹ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఈ శిబిరాల్లో గైనకాలజిస్ట్, ఆర్థోపెడిక్, ఆప్తల్మాలజీ, పీడియాట్రిక్, జనరల్ మెడిసిన్ వైద్య నిపుణులను ఏర్పాటు చేసి ప్రజలకు ఉచితంగా 11 రకాల పరీక్షలు నిర్వహించి, మందులు ఉచితంగా అందివ్వడం జరుగుతోందన్నారు. ఈ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంతకుముందు ఆయన శిబిరాన్ని ప్రారంభించి, అందులోని స్టాల్స్‌ను పరిశీలించారు. వైద్యులు, సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. వైద్య పరీక్షలు పూర్తయిన వారికి ఆరోగ్య సురక్ష కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్ ఖాన్, కార్పొరేటర్ ఎం. సుబ్బారెడ్డి, నాయకులు రాజగోపాల్‌రెడ్డి, సుబ్బారెడ్డి, బండిప్రసాద్, సుదర్శన్‌రెడ్డి, తోటక్రిష్ణ పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్‌ల తనిఖీ

కడప రూరల్: వైద్య ఆరోగ్య శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్ శనివారం కడప నగరంలోని స్కానింగ్ సెంటర్‌లను తనిఖీ చేశారు. అందులో భాగంగా రికార్డ్స్, రిజిస్టర్‌లను పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా రిజిస్టర్ కాని స్కాన్ సెంటర్స్ ఉంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎస్పీని కలిసిన ఆర్టీసీ చైర్మన్



కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్‌ను ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి, ఆర్ఎం పొలిమేర గోపాల్‌రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ జిల్లాలోని ఆర్టీసీ సంస్థ స్థితిగతులను వారిని అడిగి తెలుసుకున్నారు. ప్రైవేటు వాహనాలను అరికట్టేందుకు జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సంస్థ పురోభివృద్ధికి తోడ్పాటు అందించాలని చైర్మన్, ఆర్ఎం జిల్లా ఎస్పీని కోరారు. అనంతరం ఎస్పీని వారు ఘనంగా సత్కరించారు.

వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన

కడప కార్పొరేషన్: ఘన, వ్యర్థ పదార్థాల నిర్వహణపై ఆర్తీ హోం విద్యార్థులకు నగరపాలక శానిటరీ అధికారులు అవగాహన కల్పించారు. శనివారం స్కూల్ పిల్లలను ఉక్కాయపల్లెలోని ఎకో ఫ్రెండ్లీ పార్కుకు తీసుకుపోయి అక్కడ తడిచెత్తను ఎలా ఎరువుగా మారుస్తున్నారో చూపించారు. తడిచెత్త, పొడిచెత్తలను వేరు చేయడం, పొడిచెత్తను తిరిగి రీసైకిల్ చేయడం వంటి వాటి గూర్చి సవివరంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

సకాలంలో జీతాలు ఇవ్వాలి

కడప ఎడ్యుకేషన్: ఉద్యోగులకు సకాలంలో జీతాలను చెల్లించాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ఒక ప్రకటనలో అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులకు వేతనాలు, బకాయిలను చెల్లించకుండా వారిని వేధించడం సబబు కాదన్నారు.

నృత్య ప్రదర్శన



కడప నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల 31వ ఫ్రెషర్స్‌డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లయన్స్‌క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షుడు పోతుల వెంకటరామిరెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించి మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. సూర్యనారాయణరెడ్డి , కరస్పాండెంట్ బైరెడ్డి రామకృష్ణారెడ్డి, గాయత్రి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. పురుషోత్తంరెడ్డి, ఆయేషా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హసీనాబేగం, నారాయణ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటస్వామిలు ప్రసంగించారు. అనంతరం కళాశాల విద్యార్థినులు చేసిన నృత్యప్రదర్శనలు అలరించాయి. – వైవీయూ

పెద్దదర్గాలో ప్రార్థన



కడప అమీన్‌పీర్ దర్గాను శనివారం 'సగిలేటి కథ' సినీ బృందం ప్రతినిధులు దర్శించుకున్నారు. దర్గా ముజావర్ అమీర్ వారికి స్వాగతం పలికి సంప్రదాయంగా పేటాలను ధరింపజేసి దర్గా గురువుల దర్శనం చేయించారు. ఈ సందర్భంగా వారు ప్రధాన గురువుల మజార్ వద్ద చాదర్ సమర్పించి ప్రార్థనలు చేయించారు. అనంతరం ఆ ప్రాంగణంలోని ఇతర గురువుల మజార్ల వద్ద కూడా ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా బృందం ప్రతినిధి, సినీ హీరో రవి మహాదాస్యం, నిర్మాత దేవిప్రసాద్ బలివాడ, దర్శకులు రాజశేఖర్‌లు మాట్లాడారు. ఈ సినిమా జిల్లాకు చెందిన కథతో నిర్మించామని, ఆదరించాలన్నారు. – కడప కల్చరల్

కడపలో చిత్రీకరణ పూర్తి



నాని మూవీ వర్క్స్ ఆధ్వర్యంలో విశ్వకార్తిక్, ఆయుషి పటేల్ జంటగా నటిస్తున్న కలియుగం పట్టణంలో సినిమా షూటింగ్ కడప జిల్లాలో పూర్తి అయ్యిందని సినిమా నిర్మాత కందుల గ్రూపు విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి తెలిపారు. శనివారం కడప నగరంలోని వైఎస్సార్ బస్సు ప్రాంగణంలో కొన్ని సన్నివేశాలను తెరకెక్కించారు. ఈ సందర్భంగా వారు విలేకర్లతో మాట్లాడుతూ సినిమా చిత్రీకరణ కడపజిల్లాలో పూర్తి అయ్యిందన్నారు. చిత్ర దర్శకులు రమాకాంత్‌రెడ్డి మాట్లాడుతూ కడప జిల్లాను సినిమాలో తీయడం ఆనందంగా ఉందన్నారు. – కడప ఎడ్యుకేషన్

ఎందుకు ఓడిపోతున్నాడో పుత్తా ఆత్మ పరిశీలన చేసుకోవాలి

– ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్‌కుమార్



మాట్లాడుతున్న ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్‌కుమార్

కడప కార్పొరేషన్: ప్రతిసారీ ఎందుకు ఓడిపోతున్నాడో కమలాపురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి ఆత్మ పరిశీలన చేసుకోవాలని ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్ అన్నారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మాజీ సర్పంచ్ ఎం. రాజారెడ్డి, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్‌లతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్య దేశంలో ఎవరు ఏ పార్టీలోనైనా చేరవచ్చునన్నారు. ఒకరిద్దరు పోయినంత మాత్రానా వైఎస్సార్‌సీపీకి నష్టమేమీ లేదన్నారు. పార్టీలో చేరికల సందర్భంగా పుత్తా నరసింహారెడ్డి బెండు తీస్తా, తాట తీస్తానని దూషణలకు దిగడం దారుణమన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి వాటికి చోటు లేదన్నారు. పుత్తా చరిత్రంతా కబ్జాలు, దౌర్జన్యాలు, దాడులు చేయడమేనన్నారు. దళిత, బడుగు, బలహీనవర్గాల ప్రజల ఇళ్లు, పొలాలు లాక్కోవడం వల్ల వారు ఊర్లు ఖాళీ చేసి వెళ్లిపోయారని గుర్తు చేశారు. కడపలో సాయిబాబా హాలు వద్ద, బిల్టప్ వద్ద ఆస్తులను ఎవరు ఆక్రమించారో ప్రతి ఒక్కరికీ తెలుసన్నారు. ఆయన బాధితులు ఇప్పటికీ న్యాయస్థానాల చుట్టూ, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారన్నారు. భయపెట్టడం, ప్రలోభపెట్టడం, దౌర్జన్యాలు, దాడులు చేయడం వల్లే ఇన్నాళ్లు ఆయన గెలవలేదన్నారు. మాజీ సర్పంచ్ రాజారెడ్డి మాట్లాడుతూ ఈసారి పుత్తాకు టికెట్ వస్తుందన్న గ్యారెంటీ లేదన్నారు. ఒక వేళ వస్తే ఐదోసారి కూడా పుత్తాకు ఓటమి తప్పదన్నారు. ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హ్యాట్రిక్ సాధించబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం. భగవాన్‌రెడ్డి, రామిరెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణే ప్రభుత్వ ధ్యేయం

చింతకొమ్మదిన్నె : ప్రజల ఆరోగ్య సంరక్షణే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, సీకేదిన్నె జడ్పీటీసీ పి.నరేన్ రామాంజులురెడ్డిలు తెలిపారు. శనివారం బుగ్గలపల్లి సచివాలయ పరిధిలోని నాగిరెడ్డిపల్లెలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ప్రజల ఆరోగ్య పరిస్థితి మెరుగు పరచడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అందులో భాగంగా ఈ వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.దీప్తి, వైద్యులు రాఘవేంద్ర, సునీత, విజయ్‌కుమార్, భరత్‌కృష్ణ, తహసీల్దార్ ఎంవీ సత్యనారాయణరెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీధర్‌లను పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

పెండ్లిమర్రి : చామంతి పూల సాగు చేసే రైతులు వేరుకుళ్లు తెగుళ్లపై జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని ఉద్యానశాఖ హెచ్‌ఓ సింధూరి తెలిపారు. శనివారం మండలంలోని పెండ్లిమర్రి గ్రామ పొలాల్లో చామంతి పూల తోటలను రైతులతో కలిసి ఆమె పరిశీలించి మాట్లాడారు. తెగుళ్ల నివారణకు జీవ ఎరువులైన ట్రైకోడెర్మావిరిడి వేసుకోవాలన్నారు.

ఈ కేవైసీని పూర్తి చేయండి

వల్లూరు : ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంట నమోదు ప్రక్రియ పూర్తయిందని, ఇందులో 95 శాతం ఈకేవైసీ పూర్తయిందని, వ్యవసాయ సిబ్బంది మిగిలిన రైతులందరితో ఆది వారం లోపు ఈ కేవైసీ పూర్తి చేసి 100 శాతం లక్ష్యాన్ని సాధించాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి అయితా నాగేశ్వరరావు తెలిపారు. తప్పెట్ల రైతు భరోసా కేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి



మార్నింగ్ విజిట్‌లో అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్: కడప నగరంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కేఎంసీ కమిషనర్ ప్రవీణ్‌చంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన ఈట్ స్ట్రీట్, శాస్త్రినగర్, అక్కాయపల్లె పార్కు, చిలకల బావి పార్కులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో ఎలాంటి నాణ్యతా లోపాలు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. పూర్తయిన పనులకు వెంటనే పెయింటింగ్ చేయించాలన్నారు. పార్కులను ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

ఈ కార్యక్రమంలో నగరపాలక ఈఈ నారాయణస్వామి, డీఈలు రాజేష్, అబిద్ హుస్సేన్, హార్టికల్చర్ ఏడీ అనిల్ కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జలకళతో భూములు సస్యశ్యామలం

– ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



రైతులకు బోర్లు, విద్యుత్ సామగ్రి అందిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : రైతులపై ఎంతో ప్రేమతో జగనన్న ప్రభుత్వం 2020లో ప్రవేశపెట్టిన వైఎస్సార్ జలకళతో మెట్ట రైతుల భూములు సస్యశ్యామలం కావడం సంతోషకరమని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక స్త్రీశక్తి భవనం వద్ద నియోజవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన 12 మంది రైతులకు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిన మోటర్లు, విద్యుత్ సామగ్రిని ఆయన రైతులకు అందజేసి మాట్లాడారు. పాదయాత్రలో రైతులు పడుతున్న కష్టాలు తెలుసుకున్న అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు ప్రతి దశలోనూ సాయం చేస్తున్నారని కొనియాడారు. విత్తు నుంచి విక్రయం వరకు అన్ని దశల్లో రైతులకు సాయం చేస్తున్నారన్నారు. మెట్ట ప్రాంత రైతుల భూములను సైతం సస్యశ్యామలం చేయాలనే ఉద్దేశంతో రైతులకు ఉచితంగా బోర్లు వేసి మోటార్లు, విద్యుత్ సరఫరా అందించడం హర్షణీయం అన్నారు. డ్వామా పీడీ యదు భూషణ్‌రెడ్డి మాట్లాడుతూ కమలాపురం నియోజకవర్గంలో 79 బోర్లు వేసామని, అందులో 64 సక్సెస్ అయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి, ఏపీఓలు, ఈసీలు, టీఏలు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

శిక్షణతో మెరుగైన ఫలితాలు



శిక్షణ పూర్తిచేసుకున్న బోధనేతర సిబ్బందితో వీసీ, రిజిస్ట్రార్

వైవీయూ : శిక్షణలో పొందిన జ్ఞానం ద్వారా మెరుగైన ఫలితాలు వస్తాయని వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. వైవీయూలో గత నెలరోజుల పాటు బోధనేతర సిబ్బందికి జీఎస్‌టీతో కలిపి ట్యాలీలో నిర్వహించిన వృత్తిపరమైన శిక్షణ ముగింపు కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ శిక్షణలో పొందిన జ్ఞానం, ఉద్యోగ విధుల్లో వినియోగించి, పరిపాలనలో వేగం పెంచాలని కోరారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఇక్కడి ఫైనాన్స్ ఆఫీసర్లు, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు ఇతర విశ్వవిద్యాలయాలకు వెళ్లి గైడ్‌చేసేంత నైపుణ్యం పొందాలని సూచించారు. కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు శ్రీనివాసరావు, శిక్షకుడు మహమ్మద్ రఫీక్‌లు శిక్షణ కాలంలో నేర్పిన అంశాలను వివరించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లను అందజేశారు.